వైభవంగా తొలి ఏకాదశి పూజలు

- చందన అలంకరణలో కల్యాణ వేంకటేశ్వర స్వామి
- ఆలయాలకు పోటెత్తిన భక్తులు


దయాల్‌నగర్ కొండపై కల్యాణ వేంకటేశ్వరుడు


ఎస్టీబీఎల్ తిరుమల బాలాజీ ఆలయంలో ..

కూర్మన్నపాలెం: తొలి ఏకాదశి పర్వదిన వేళ శ్రీనివాసుడి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేశారు. నియోజకవర్గ పరిధిలోని ఆలయాలన్నీ భక్తులతో పోటెత్తాయి. వేంకటేశ్వర స్వామిని విశేషంగా అలంకరించి, అర్చనలు, అభిషేకాలు చేశారు.

- 86వ వార్డు లక్ష్మీపురంలోని కల్యాణ వేంకటేశ్వర స్వామి చందన అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. తొలిఏకాదశిని పురస్కరించుకుని అర్చకులు ఉదయ్‌కుమార్ నేతృత్వంలో శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి వారికి విశేష పూజలు, అభిషేకాలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు. తరంగిణి మహిళా భక్త బృందం ఆధ్వర్యంలో భక్తి గీతాలను ఆలపించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు యు.వి.రాజు, కేవీఎస్ఎన్ రాజు, కె.శ్రీనివాసరాజు, సుబ్బరాజు, వాడపల్లి రామచంద్రవర్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రసన్న వేంకటేశ్వరాలయంలో..
అక్కిరెడ్డిపాలెం: భెల్ సిగ్నల్ పాయింట్ వద్ద గల ప్రసన్న వేంకటేశ్వరాలయంలో తొలి ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. స్వామికి అన్నకూటోత్సవం నిర్వహించారు. భక్తులు ఆలయ ప్రదక్షిణ చేశారు. ఈ సందర్భంగా ప్రసిద్ధ అర్చకుడు భాష్యం శ్రీనివాసరావును ఆలయ ప్రధానార్చకులు నారాయణాచార్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ పరిపాలనాధికారి ఎ.జగన్నాథరావు, ఆలయ పరిపాలక కమిటీ చైర్మన్ గంధ్రెడ్డి రామునాయుడు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బొడ్డేడ అచ్చెంనాయుడు, మిండా లక్ష్మి, ఎం.సత్యవతి, పెట్ల అప్పారావు, ఎస్.శ్రీనివాసరావు, ఎక్స్ అఫీషియో మెంబర్ పణిహారం నారాయణాచార్యులు పాల్గొన్నారు.


చందన అలంకరణలో కల్యాణ వేంకటేశ్వర స్వామి


స్టీల్‌ప్లాంట్ సెక్టార్-1లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు

ఎస్టీబీఎల్ బాలాజీ ఆలయంలో ..
షీలానగర్ ఎస్టీబీఎల్‌లో కొలువైయున్న తిరుమల బాలాజీ పుణ్యక్షేత్రంలో కొలువైన శ్రీనివాస కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని కనులారా కల్యాణాన్ని తిలకించారు. ఎస్టీబీఎల్ ప్రాజెక్ట్స్ అధినేత గుత్తికొండ బాలాజీ నేతృత్వంలో సంస్థ జీఎం కృష్ణయ్య, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌లో..
ఉక్కునగరం: స్థానిక సెక్టార్-1 వేంకటేశ్వరస్వామి దేవాలయంలో తొలి ఏకాదశి సందర్భంగా వేకువజామున ఐదు గంటలకు స్వామికి సుప్రభాత సేవ నిర్వహించారు. ఉదయం 6 గంటల నుంచి భక్తులకు స్వామి దర్శనం కల్పించారు. ఉదయం 9 గంటలకు మహిళలు విష్ణు సహస్రనామ పారాయణ, భగవద్గీత పారాయణ చేశారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

దయాల్‌నగర్ కొండపై..
పెదగంట్యాడ: తొలి ఏకాదశి సందర్భంగా దయాల్ నగర్ కొండపై వేంచేసియున్న కల్యాణ వేంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ధర్మకర్త తిప్పల రమణారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన పూజల్లో భక్తులు పాల్గొన్నారు.

- 75వ వార్డు నెల్లిముక్కు రామాలయంలో తొలి ఏకాదశి పూజలను ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు పులి వెంకటరమణారెడ్డి, గొందేశి మహేశ్వరరెడ్డి, దూడ సింహాచలం రెడ్డి, ధర్మాల పైడిరెడ్డి తదితరులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.


భెల్ జంక్షన్‌లోని ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రదక్షిణ చేస్తున్న భక్తులు


ఎస్టీబీఎల్ తిరుమల బాలాజీ ఆలయంలో శ్రీనివాస కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

అగనంపూడి: తొలి ఏకాదశి సందర్భంగా ఇంద్రద్యుమ్న హాలు వద్ద వేంచేసియున్న జగన్నాథస్వామికి గురువారం ప్రత్యేక పూజలు చేశారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, కార్పొరేటర్ బొండా జగన్ ఉత్సవమూర్తులకు తొలి ఏకాదశి పూజలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ జెర్రిపోతుల సోమునాయుడు, ఆలయ వ్యవస్థాపక వంశీయులు గురు మోహన్ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ప్రసాద వితరణ చేపట్టారు. బొర్రమాంబ పారాయణ సేవా సమితి ఆధ్వర్యంలో 50 మంది బృంద ప్రతినిధులు విష్ణు, లలిత పారాయణం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఇల్లపు ప్రసాద్, ఆలయ కమిటీ ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.


అన్న సమారాధన ప్రారంభిస్తున్న దేవన్‌రెడ్డి

భక్తిశ్రద్ధలతో బక్రీద్


ఈద్గా మైదానంలో ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు


స్టీల్‌ప్లాంట్ మసీదులో ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు


ప్రార్థనల్లో పాల్గొన్న ఎమ్మెల్యే నాగిరెడ్డి తదితరులు

గాజువాక: ఈదుల్ అజ్ హా (బక్రీద్) పండగను ముస్లింలు గురువారం ఘనంగా నిర్వహించారు. త్యాగానికి గుర్తుగా జరుపుకొనే ఈ వేడుక సందర్భంగా గాజువాకలోని ఈద్గా మైదానంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం వివిధ మసీదుల్లోనూ ప్రార్థనలు చేశారు. ఈద్గా మైదానంలో నిర్వహించిన ప్రార్థనల్లో ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి పాల్గొన్నారు. ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ త్యాగం, ప్రేమ, సహనం వంటి సద్గుణాల సందేశమే బక్రీద్ అని పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, పార్టీ మైనార్టీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.ఎం.డి.గౌస్, మాజీ కార్పొరేటర్ మహ్మద్ రఫీ, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

77వ వార్డులో..
పెదగంట్యాడ: బక్రీద్‌ను పురస్కరించుకుని 77వ వార్డు ఇస్లాంపేట, పెదపాలెం, చినపాలెం తదితర ప్రాంతాల్లోని ముస్లిం పెద్దలు, యువకులు పెద్ద సంఖ్యలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎస్‌కె నన్నా మాట్లాడుతూ ప్రేమ, సహనం, విశ్వాసం, త్యాగం, కరుణ, ఐక్యతకు ప్రతీక బక్రీద్ అన్నారు. మనకున్న దాంట్లో నలుగురికీ సహాయం చేయాలనే సందేశాన్ని ఈ పండగ ఇస్తుందన్నారు. అనంతరం మదర్సాలోని పిల్లలకు మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.


77వ వార్డులో ప్రార్థనలకు వెళ్తున్న ముస్లింలు

స్టీల్‌ప్లాంట్ మసీదులో..
ఉక్కునగరం: బక్రీద్ సందర్భంగా స్టీల్‌ప్లాంట్ సెక్టార్-6 మసీదులో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మత గురువుల ఆధ్వర్యంలో జరిగిన ప్రత్యేక నమాజ్‌లో పెద్ద సంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు. బంధువులకు, స్నేహితులకు మాంసం, స్వీట్లు పంపిణీ చేశారు. చుట్టుపక్కల ఉన్న పేద ముస్లింల ఇంటికి వెళ్లి, వారికి కానుకలు అందజేసి బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. మసీదు కమిటీ ప్రతినిధులు పలువురు పాల్గొన్నారు.
అక్కిరెడ్డిపాలెం: 68వ వార్డుకు చెందిన ముస్లిం నాయకులు హుస్సేన్ బ్రదర్స్ ఎమ్మెల్యే నాగిరెడ్డికి శుభాకాంక్షలు తెలిపి, సత్కరించారు. వైఎస్సార్ సీపీ నాయకులు బోనెల జోసెఫ్, గొంతిన వెంకటలక్ష్మి, వెంకటరమణ, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బొర్రమాంబ పారాయణ సేవా సమితి కమిటీ ఏర్పాటు


బొర్రమాంబ ఆలయంలో పూజలు చేస్తున్న సేవా సమితి ప్రతినిధులు

అగనంపూడి: అగనంపూడి పరిసర ప్రాంతాల్లోని అమ్మవారి ఆలయాల్లో విష్ణు సహస్ర నామ పారాయణం, లలితా పారాయణం చేస్తున్న అగనంపూడికి చెందిన మహిళలు శ్రీ బొర్రమాంబ పారాయణ సేవా సమితిగా ఏర్పడ్డారు. మహాత్మా గాంధీ సేవా సమితి అధ్యక్షుడు చిత్తా రామారావు పర్యవేక్షణలో ఏర్పాటైన కమిటీకి అధ్యక్షురాలిగా చిత్తా జానకి, సహాయ అధ్యక్షురాలిగా గురం లక్ష్మి ఎన్నికయ్యారు. కార్యదర్శిగా చిత్తా శోభారాణి, సహాయ కార్యదర్శిగా తలారి లలితా కుమారి, కోశాధికారిగా కరణం రమాదేవి, కార్యనిర్వాహక కార్యదర్శులుగా బలిరెడ్డి పద్మ, చిత్తా పద్మతో పాటు సభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం బొర్రమాంబ అమ్మవారికి పూజలు చేశారు.

దేశాభివృద్ధిలో గణాంకాలు కీలకం

గాజువాక: స్థానిక ఎంవీఆర్ డిగ్రీ కళాశాలలో గణాంకశాస్త్ర దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గణాంకాల (స్టాటిస్టిక్స్) ప్రాముఖ్యతను కళాశాల కరస్పాండెంట్ వి.రామారావు వివరించారు. దేశాభివృద్ధిలో గణాంకాలు ముఖ్యభూమికను వహిస్తాయని తెలిపారు. స్టాటిస్టిక్స్ విభాగాధిపతి షేక్ కౌసర్ మాట్లాడుతూ నిత్యజీవితంలో గణాంకాల అప్లికేషన్లు ఏ విధంగా ఉపయోగపడతాయో వివరించారు. కార్యక్రమంలో గణిత శాస్త్ర విభాగాధిపతి రామ్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వై.ఈశ్వరరాజు, వైస్ ప్రిన్సిపాల్ ఎస్.వి.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జేసీఎస్ మండల ఇన్‌చార్జిల నియామకం

గాజువాక: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం జేసీఎస్ మండల ఇన్‌చార్జిలను నియమించింది. గాజువాక నియోజకవర్గంలోని 64, 65, 74, 75, 76 వార్డుల ఇన్‌చార్జిగా కులుకూరి మంగరాజు, 66, 71, 72, 73 వార్డుల ఇన్‌చార్జిగా రాజాన వెంకటరావు, 67, 68, 69, 70 వార్డుల ఇన్‌చార్జిగా ఎస్.ఎం.డి.గౌస్, 79, 85, 86, 87, 88 వార్డుల ఇన్‌చార్జిగా వాడపల్లి వెంకట రామచంద్రరాజు నియమితులయ్యారు.

హోమియో వైద్యురాలికి సాదర వీడ్కోలు


డాక్టర్ సౌభాగ్యవతికి పుష్పగుచ్ఛం అందిస్తున్న మిందివాసులు

అక్కిరెడ్డిపాలెం: మిందిలో హోమియోపతి డాక్టర్‌గా విశేష సేవలందించి, బదిలీపై అచ్యుతాపురం వెళ్తున్న డాక్టర్ సౌభాగ్యవతికి మిందివాసులు ఘనంగా వీడ్కోలు పలికారు. మింది సీనియర్ సిటిజన్స్ ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ సీఈసీ సభ్యుడు గుడివాడ అప్పల రామ్మూర్తి ఆమెను ఘనంగా సత్కరించి, సేవలను కొనియాడారు. ఆస్పత్రిలో కాంపౌండర్ వేణుగోపాల్‌కు కూడా నగరానికి బదిలీ కావడంతో ఆయన్ను అభినందించారు. వార్డు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి లతీష్ పాల్గొన్నారు.

కందుల ఆనందరావుకు నివాళి

కూర్మన్నపాలెం: దళిత హక్కుల కోసం జాతీయస్థాయిలో ఉద్యమించిన ఆల్ ఇండియా దళిత రైట్స్ ఫోరం అధ్యక్షుడు కందుల ఆనందరావు సేవలు చిరస్మరణీయమని కూర్మన్నపాలెం ఎస్సీ, ఎస్టీ సంక్షేమ సంఘం ప్రతినిధులు కొనియాడారు. ఆనందరావు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. నాయకులు మాటూరి శ్రీనివాసరావు, బలిరెడ్డి నాగేశ్వరరావు, గాలి ఆనంద్, బలిరెడ్డి పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

‘ఉక్కు’ సంకల్పానికి కేంద్రం తలవంచాల్సిందే..


868వ రోజు ఉక్కు దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: ఉక్కు సంకల్పంతో నిర్విరామంగా కొనసాగుతున్న స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ ఉద్యమానికి కేంద్ర ప్రభుత్వం తలవంచక తప్పదని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారం నాటికి 868వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విశాఖ ఉక్కు కర్మాగారం అమ్మాలనే ఆలోచన వచ్చిన మోదీ ప్రభుత్వానికి ప్రజలు గట్టిగా బుద్ధి చెప్తారన్నారు. ఎందరో కార్మికుల బలిదానాలతో సాధించుకున్న విశాఖ ఉక్కును ప్రైవేట్ వ్యక్తులకు అప్పజెప్పడం దుర్మార్గమన్నారు. వెంటనే స్టీల్‌ప్లాంట్ ప్రభుత్వ రంగంలోనే కొనసాగుతుందనే ప్రకటనను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటాలను ఉధృతం చేసేందుకు భవిష్యత్తు ప్రణాళికను సిద్ధం చేస్తున్నామన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తన నిరంకుశత్వ నిర్ణయాన్ని వీడి ప్రైవేటీకరణను ఆపాలని కోరారు. కార్యక్రమంలో ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

‘అగనంపూడి టోల్‌గేటు తరలించాలి’


మాట్లాడుతున్న పూర్ణ

అగనంపూడి: అనకాపల్లి-సబ్బవరం మధ్య టోల్‌గేటు ఏర్పాటు చేసిన తరువాత కూడా అగనంపూడి టోల్‌గేటు కొనసాగించడం అన్యాయమని రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ జి.పూర్ణానందశర్మ అన్నారు. వెంటనే టోల్‌గేట్‌ను ఇక్కడి నుంచి తరలించాలని డిమాండ్ చేశారు. అగనంపూడిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఐదేళ్ల క్రితం హైకోర్టు ఆదేశాల మేరకు టోల్ ఫీజు ఉపసంహరించుకున్నారని, తరువాత హైవే అధికారులు, కాంట్రాక్టర్ సుప్రీంకోర్టును ఆశ్రయించే సమయంలో అనకాపల్లి వద్ద టోల్‌గేటు ఏర్పాటు చేసిన తరువాత అగనంపూడి టోల్‌ప్లాజాను మూసివేస్తామని న్యాయస్థానానికి రాతపూర్వకంగా హామీ ఇచ్చారని పేర్కొన్నారు. రెండున్నర దశాబ్దాల క్రితం రహదారి విస్తరించే సమయంలో రుణంగా తీసుకున్న మొత్తం తిరిగి రాబట్టిన తరువాత కూడా అడ్డగోలుగా దోపిడీ చేయడం తగదన్నారు. బీజేపీ నాయకులు ఒత్తిడి తీసుకువచ్చి టోల్‌గేటును మూసివేయించాలని కోరారు.

వైఎస్సార్ విగ్రహం ఏర్పాటుకు భూమి పూజ

అక్కిరెడ్డిపాలెం: మింది జిల్లా జిల్లా పరిషత్ హైస్కూల్ వద్ద ఏర్పాటు చేయనున్న దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్.రాజశేఖర రెడ్డి విగ్రహం ఏర్పాటుకు వైఎస్సార్ సీపీ సీఈసీ మెంబర్ గుడివాడ అప్పలరామ్మూర్తి గురువారం భూమి పూజ చేశారు. ఆయన మాట్లాడుతూ జూలై 8న విగ్రహం ప్రతిష్ఠించనున్నట్లు తెలిపారు. విగ్రహం ప్రారంభోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ వార్డు ఇన్‌చార్జి గుడివాడ లతీష్, గుడివాడ అప్పన్న మెమోరియల్ ట్రస్ట్ ప్రతినిధులు, నాయకులు ఈటి సురేష్, రెడ్డిపల్లి చిట్టిబాబు, గుర్రం త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.


భూమి పూజ చేస్తున్న గుడివాడ అప్పలరామ్మూర్తి

ట్రిపుల్ ఆర్ సెంటర్లతో పర్యావరణానికి మేలు

జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ


ట్రిపుల్ ఆర్ సెంటర్‌లో పరిశీలిస్తున్న జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ తదితరులు

అల్లిపురం: అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణకు రెడ్యూస్, రీయూజ్, రీ సైకిల్ సెంటర్లు (ట్రిపుల్ ఆర్) ఎంతో ఉపయోగపడతాయని జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ అన్నారు. గురువారం ఆయన ఎండాడ, తగరపువలస, గాజువాక, పెందుర్తి ప్రాంతాల్లో గల ట్రిపుల్ ఆర్ సెంటర్లను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ట్రిపుల్ ఆర్ సెంటర్ల ఉపయోగాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణకు, వ్యర్థాల నిర్వహణకు, స్థిరమైన అభివృద్ధికి ఈ కేంద్రాలు బాటలు వేస్తాయని పేర్కొన్నారు. వ్యర్థ పదార్థాల్లో అనేక రకాల గాజు, కాగితం, మెటల్, ప్లాస్టిక్, టైర్లు, దుస్తులు, పుస్తకాలు, బ్యాటరీలు, ఎలక్ట్రానిక్స్ ఉపకరణాలను ట్రిపుల్ ఆర్ సెంటర్ల ద్వారా సేకరించి రీసైక్లింగ్ చేసి ఆట వస్తువులతోపాటు ఇతర వస్తువులు తయారు చేయవచ్చన్నారు. అనంతరం తగరపువలస, సబ్బివానిపాలెంలోని బుక్ కేఫ్‌ను సందర్శించి పౌరులకు మంచి విజ్ఞానాన్ని అందించే పుస్తకాలు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఆయనతో పాటు జీవీఎంసీ అదనపు కమిషనర్ డాక్టర్ వి.సన్యాసిరావు, ప్రధాన వైద్యాధికారి నరేష్‌కుమార్, పర్యవేక్షక ఇంజినీర్లు శ్యాంసన్ రాజు, సత్యనారాయణరాజు, జోనల్ కమిషనర్ కనక మహాలక్ష్మి, ఏఎంహెచ్‌వో కిషోర్ తదితరులు ఉన్నారు.

సింహగిరిపై మొక్కల పంపిణీ


భక్తులకు మొక్కలను అందజేస్తున్న ట్రస్ట్‌బోర్డు సభ్యులు

సింహాచలం: తొలి ఏకాదశి పురస్కరించుకుని గురువారం సింహగిరిపై స్వధర్మ వాహిని ఆధ్వర్యంలో భక్తులకు మొక్కలు పంపిణీ చేశారు. గాజువాకకు చెందిన భక్తులు కాశీ కృష్ణ, కంచి శేషగిరిరావు కడియం నుంచి తీసుకొచ్చిన వెయ్యి మొక్కలు అందజేశారు. ఆ మొక్కలకు ఆలయ ప్రధానార్చకుడు ఇరగవరపు రమణాచార్యులు, అర్చకులు కల్యాణ మండపంలో పూజలు చేశారు. అనంతరం రాజగోపురం వద్ద ఉన్న కళావేదిక వద్ద దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యులు, అధికారులు భక్తులకు మొక్కలు పంపిణీ చేశారు. దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యులు సంపంగి శ్రీనివాసరావు, వారణాసి దినేష్‌రాజ్, సువ్వాడ శ్రీదేవి, ముదుండి రాజేశ్వరి, ఆలయ ఏఈవో భ్రమరాంబ, సూపరింటెండెంట్ పాలూరి నరసింగరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళావేదికపై అన్నమయ్య సేవా ట్రస్ట్ నిర్వాహకురాలు సునీత ఆధ్వర్యంలో సామూహిక విష్ణుసహస్రనామ పారాయణ చేపట్టారు.

ఘనంగా జగన్నాథుడి తిరుగు రథయాత్ర


తిరుగు యాత్రలో పాల్గొన్న భక్తులు, ఆలయ కమిటీ ప్రతినిధులు

అగనంపూడి: జగన్నాథస్వామి తిరుగు రథ యాత్ర గురువారం అంగరంగ వైభవంగా జరిగింది. సాయంత్రం ఐదు గంటలకు ఇంద్రద్యుమ్న హాలు నుంచి బలభద్ర, సుభద్ర సహిత జగన్నాథస్వామిని రథంపై అధిష్ఠింపజేసి, రథాన్ని జాతీయ రహదారిమీదుగా ఆలయం వరకు భక్తులు లాక్కొని వెళ్లారు. వందలాదిగా పాల్గొన్న భక్తులు రథం లాగేందుకు పోటీ పడ్డారు. కోలాటంతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. ఆలయ కమిటీ చైర్మన్ జెర్రిపోతుల సోమునాయడు, కమిటీ ప్రతినిధులు గెద్దాడ సత్యవతి, దేవరాజు, శ్రీనుబాబు, సన్యాసమ్మ, ఆలయ పూర్వీకులు గురు త్రినాథ్, మోహన్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు


మహిళకు సంక్షేమ పథకాల కరపత్రం అందిస్తున్న గాజువాక ఎమ్మెల్యే నాగిరెడ్డి

పెదగంట్యాడ: రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమాలకు సమ ప్రాధాన్యం ఇస్తూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల మన్ననలు అందుకుంటున్నారని ఎమ్మెల్యే నాగిరెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా 74వ వార్డు గౌరీ సేవా సంఘం కాలనీలో కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి ఆధ్వర్యంలో గురువారం ఆయన పర్యటించారు. ప్రతీ గడపకు వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, వారికి చేకూరిన లబ్ధి గురించి వివరించారు. అలాగే ప్రజా సమస్యలను తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూరుస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, ఎన్‌వై నాయుడు, అనపర్తి త్రినాథ్, ఎస్.రాజారావు, పవన్‌కుమార్, శీకు రమణ, సీతారాం తదితరులు పాల్గొన్నారు.

అట్టడుగు వర్గాల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం


గంగిరెడ్ల కాలనీలో పథకాల బ్రోచర్‌ను అందిస్తున్న పెందుర్తి ఎమ్మెల్యే అదీప్‌రాజ్

అగనంపూడి: అట్టడుగు వర్గాల అభ్యున్నతి కోసం రాష్ట్ర ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తోందని పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. 85వ వార్డు గంగిరెడ్ల కాలనీ, ఎస్సీ కాలనీల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం గురువారం కొనసాగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అదీప్‌రాజ్ మాట్లాడుతూ గ్రామస్వరాజ్యం, అర్హులైన ప్రతీ ఒక్కరికీ ప్రభుత్వ పథకాల ఫలాలు, సంక్షేమం, అభివృద్ధి ఫలాలు అందించడం కోసం ‘గడప గడపకు మన ప్రభుత్వం’ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వ పథకాలు అందిస్తున్న ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి, ప్రసాద్, రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ జి.పూర్ణానందశర్మ, 79వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ అప్పికొండ మహాలక్ష్మినాయుడు, నాయకులు సుందరపు అప్పారావు, కింతాడ ఈశ్వరరావు, దాసరి ప్రకాష్, కర్రి నరసింగరావు తదితరులు పాల్గొన్నారు.